క్లుప్తంగా

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం



కల్వకుర్తి టౌన్‌: ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అబూబుకర్‌ ఫంక్షన్‌ హాలులో సబ్సిడీ సిలిండర్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ పత్రాలను మున్సిపల్‌ చైర్మన్‌ సత్యంతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం మున్సిపాలిటీలోని సిలార్‌పల్లి వార్డులో స్ట్రీట్‌ లైట్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కౌన్సిలర్లు శ్రీను, బాలునాయక్‌. రవీందర్‌, కమిషనర్‌ మహమూద్‌ షేక్‌, మున్సిపల్‌ అధికారులు, కాంగ్రెస్‌ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హైమాస్ట్‌ లైట్ల ప్రారంభం

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపురంలో రూ.6 లక్షల ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో మూడు హైమాస్ట్‌ లైట్లను శుక్రవారం తహసీల్దార్‌ జయంతి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు నర్సింహ యాదవ్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు గోపాల్‌, మహేష్‌, రమేష్‌, కుర్మయ్య, వెంకటస్వామి, చంద్రశేఖర్‌, నర్సింహనాయుడు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్‌ రూరల్‌: జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌ నాయక్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మండలంలోని ముక్కిడిగుండంలో ఏర్పాటు చేసిన గిరిజనుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూములు శిస్తూ చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలివ్వాలన్నారు. తండాలు, గూడెంలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తండాలను, గూడెంలను గ్రామ పంచాయతీలుగా గుర్తించాలన్నారు. సమావేశంలో గిరిజనులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్‌ కార్యకర్తల పదసంచలన్‌



కల్వకుర్తిరూరల్‌: రాష్ట్రీయ స్వయం సేవక్‌ సంఘ్‌ 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని వంద సంవత్సరాలకు అడుగుపెడుతున్న శుభసందర్భంగా శుక్రవారం స్వయం సేవక్‌లు పట్టణంలో పదసంచలన్‌ నిర్వహించారు. పట్టణంలోని శిశుమందిర్‌ పాఠశాలలో నిర్వహించిన ప్రార్థనలో ఆర్‌ఎస్‌ఎస్‌ కార్యకర్తలు హాజరయ్యారు. దండాలతో పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య కూడళ్లలో ఆర్‌ఎస్‌ఎస్‌ కార్యకర్తలపై స్థానికులు పూలు చల్లి స్వాగతం పలికారు.

ఆర్థికసాయం అందజేత

లింగాల: మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు రఘుపతిరాథోడ్‌ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు డబ్బులను పోగు చేసి రూ.41,500 లను బాధిత కుటుంబసభ్యులను అందజేశారు. కార్యక్రమంలో రమేష్‌, శివ, శ్రీకాంత్‌, నరేష్‌, భాస్కర్‌, గణేష్‌, మల్లేష్‌, రాంబాబు పాల్గొన్నారు.

గ్రామానికి మంచి పేరు తీసుకురావాలి

బల్మూర్‌: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గ్రామ యువత గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అనంత సాహితీ పీఠం అధ్యక్షుడు అడెపు శ్రీను పేర్కొన్నారు. శుక్రవారం అనంత సాహితీ పీఠం ఆధ్వర్యంలో మండలంలోని అనంతవరంలో పోలీసు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించిన వారితో పాటు పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో గూడెలి శ్రీనయ్య, శేఖరయ్య, దానయ్య, యువకులు పాల్గొన్నారు.



అచ్చంపేట వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో..



తెలకపల్లి మండలం గౌరారంలో..



తాడూరు మండలం సిర్సవాడలో..



తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లిలో..



కొల్లాపూర్‌లో..

మహిషాసురమర్దినిగా అమ్మవారు

సాక్షి, నెట్‌వర్క్‌: జిల్లా వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం కొల్లాపూర్‌, అచ్చంపేట, కల్వకుర్తి, బిజినేపల్లి, తెలకపల్లి, పెద్దకొత్తపల్లి, తాడూరు, మన్ననూరు, ఉప్పునుంతల, లింగాల, చారకొండ, బల్మూరు మండలాల్లో అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనం ఇచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కోడేరు మండలం రాజాపూర్‌లో హోమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో సామూహిక కుంకుమార్చనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం చేశారు.



అచ్చంపేటలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



కల్వకుర్తిలో పూజలు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్‌ సీతారామారావు



చారకొండ మండలం గోకారంలో..



ఉప్పునుంతల కేదారేశ్వరాలయంలో..



పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాములలో..



మన్ననూర్‌ వేణుగోపాల స్వామి ఆలయంలో..



బల్మూర్‌ మండలం కొండనాగులలో..



లింగాలలో..



కోడేరు మండలం రాజాపూర్‌లో..

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

నాగర్‌కర్నూల్‌రూరల్‌: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీ డాక్టర్‌ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తూడుకుర్తిలో యంగ్‌ ఇండియా ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్సియల్‌ పాఠశాల నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో కలిసి ఎంపీ డాక్టర్‌ మల్లురవిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఎకరాల్లో పాఠశాలన ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్‌ ఉంటుందని పేర్కొన్నారు. 4వ తరగతి నుంచి ఇంటర్‌ వరకు చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. రూ.5 వేల కోట్లతో పాఠశాల నిర్మిస్తునట్లు వివరించారు. ఇంద్రకల్‌, పాలెం, పోతిరెడ్డిపల్లికి సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని అన్నారు. తొలి విడుతలో నాగర్‌కర్నూల్‌కు యంగ్‌ ఇండియా ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్సియల్‌ పాఠశాలను మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్‌ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్డీఓ సురేష్‌, సింగిల్‌ విండో చైర్మన్‌ బి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

ఉప్పునుంతల: కాంగ్రెస్‌ అధికారం చేపట్టిన తర్వాత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని నాగర్‌కర్నూల్‌ ఎంపీ మల్లురవి అన్నారు. శుక్రవారం మండలంలోని రాయిచెడ్‌ గ్రామ శివారులో యంగ్‌ ఇండియా ఇంటిగ్రేటెడ్‌ బాలుర రెసిడెన్సియల్‌ పాఠశాల నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్‌ వంశీకృష్ణ, డీసీసీబీ చైర్మన్‌ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి ఎంపీ శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌ పాఠశాలలను ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు. మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌లు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని బలహీనపర్చేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. మూసీ బాధితుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌ను ఏర్పాటు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ కృష్ణానదిపై వంతెన నిర్మాణం కోసం డీపీఆర్‌ పూర్తెయ్యిందని పేర్కొన్నారు. అచ్చంపేటలోని సీతరాలగుట్ట వద్ద స్వర్గీయ మహేంద్రనాథ్‌ పేరిట కళాభవనంతోపాటు రూ.60 లక్షలతో అధునాతన లైబ్రెరీని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రాజేందర్‌, డీఈఓ గోవిందరాజులు, ఉమామహేశ్వరం దేవస్థాన కమిటీ చైర్మన్‌ మాధవరెడ్డి, ఆర్‌డీఓ మాధవి, ఆర్‌అండ్‌బీ డీఈఈ జలందర్‌, తహసీల్దార్‌ ప్రమీల, ఎంపీడీఓ మోహన్‌లాల్‌, ఇన్‌చార్జ్‌ ఎంఈఓ చంద్రశేఖర్‌, నాయకులు అనంతరెడ్డి, నర్సింహరెడ్డి, నర్సింహరావు, అనంతప్రతాప్‌రెడ్డి, సీఎం రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్‌ మల్లు రవి

కొనుగోలుదారులతో కూడళ్లు రద్దీ



కల్వకుర్తిలో కిటకిటలాడుతున్న మార్కెట్‌



పెద్దకొత్తపల్లిలో..

కల్వకుర్తిరూరల్‌: దసరా పండుగ సందర్భంగా శుక్రవారం పట్టణం కొనుగోలు దారులతో రద్దీగా మారింది. కొనుగోలుదారులతో పలు కూడళ్లు కిటకిటలాడాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన గ్రామస్తులు దుస్తులు, సామగ్రిని కొనుగోలు చేసి గ్రామాలకు తరలివెళ్లారు. ఆర్టీసీ బస్టాండ్‌ జనంతో కిక్కిరిసిపోయాయి. సుదూర ప్రాంతాల నుంచి వివిధ వాహనాలలో ప్రజలు కల్వకుర్తికి రావడంతో ట్రాఫిక్‌ జాం అయ్యింది.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మామిడాకులు, బంతిపూలు, పలు దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. దుస్తుల దుకాణాలు రద్దీగా కనిపించాయి. బస్టాండ్‌ ప్రాంగణం ప్రయాణికులతో కిక్కిరిసింది.

కార్యదర్శులకు నియామక పత్రాలు

ఉప్పునుంతల: అచ్చంపేట నియోజకవర్గంలో జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తూ రెగ్యులర్‌ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి పొందిన 17 మంది పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ నియామక పత్రాలను అందజేశారు. మండలంలోని రాయిచెడ్‌ సమీపంలో నిర్వహించిన యంగ్‌ ఇండియా ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌ పాఠశాల నిర్మాణం పనులకు శంకుస్థాపన కార్యక్రమం అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు నియామక పత్రాలు పంపిణీ చేశారు. అంకితభావంతో విధులను నిర్వర్తించాలని వారు సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తున్న చేసుకున్న వారి ఇళ్లను శుక్రవారం ఎంపీఓ బ్రహ్మచారి పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్‌ గ్రామాల్లో అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శికి అవసరమైన పత్రాలను ఇవ్వాలని సూచించారు. యాప్‌లో అప్‌లోడ్‌ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

చారకొండ: క్రీడల్లో గెలుపోటములు సహజమని డీసీసీ ఉపాధ్యక్షుడు ఎన్‌. వెంకటయ్య యాదవ్‌ అన్నారు. మండలంలోని జూపల్లిలో వాలీబాల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్కిల్‌ స్థాయి టోర్నమెంట్‌ శుక్రవారం ముగిసింది. వంగూరు మండలం రంగాపూర్‌ తండా జట్టు మొదటిస్థానంలో, జూపల్లి జట్టు రెండో స్థానంలో నిలిచారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. వెంకటయ్య యాదవ్‌, గాంధీజీ యువజన సంఘం అధ్యక్షుడు పరంజ్యోతి, మాజీ సర్పంచ్‌ సాయికుమార్‌, సిరాజ్‌, తిరుపతి తదితరులు ఉన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

కల్వకుర్తిరూరల్‌/లింగాల: మండలంలోని కురుమిద్దలో పోలీసులు, సివిల్‌ సప్లయ్‌ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి మూడున్నర క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టుకున్నారు. అదేవిధంగా లింగాల మండలం మగ్దూంపూర్‌ చౌరస్తాలో 5 క్వింటాళ్ల బియ్యం పట్టుకునట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్‌ పేర్కొన్నారు.

గుండెపోటుతో ఫీల్డ్‌ అసిస్టెంట్‌ మృతి

కోడేరు: మండలంలోని ఎత్తం గ్రామానికి చెందిన ఫీల్డ్‌ అసిస్టెంట్‌ గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గొల్ల శ్రీను(42) ఉపాధి హామీ ఫీల్డ్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయం గ్రామ పంచాయతీ రాగా ఛాతిలో నొప్పి వస్తుందని ఇంటికి వెళ్లాడు. గుండెనొప్పి అధికం కావడంతో ఇంట్లో కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందాడు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

దోమలపెంట: గ్రామంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను తయారుచేసి మహిళలు బొడ్డెమ్మలు ఆడారు. బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం ఎడమ పాతాళ గంగ వద్ద కృష్ణానదిలో సాంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు.



బతుకమ్మలకు పూజలు చేస్తున్న మహిళలు